క్లుప్తంగా

తాగునీటి సమస్య పరిష్కారం



పైపులైన్ పనులు చేస్తున్న కూలీలు

వెదురుకుప్పం: వెదురుకుప్పం ఎస్టీ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నట్లు స్థానిక ఎంపీటీసీ, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు రాధిక అన్నారు. ఎస్టీ కాలనీలో తాగునీటి సరఫరా లేకపోవడంతో స్థానికులు ఎంపీటీసీకి ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎంపీటీసీ రాధిక సమస్యను ఎంపీపీ నాగరాణి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మండల నిధులు రూ.3.70 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో ఓవర్ హెడ్‌ట్యాంకు నుంచి పైపులైన్ ఏర్పాటు చేయడంతో పాటు ఇంటింటికీ నీటి కొళాయిలను ఏర్పాటు చేసినట్లు ఎంపీటీసీ రాధిక తెలిపారు. అదేవిధంగా పంచాయతీలో ఏ గ్రామంలో సమస్య వచ్చినా సర్పంచ్ శిల్ప సహకారంతో అధికారులు తక్షణమే స్పందించి పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు చిరంజీవిరెడ్డి, రమేష్‌రెడ్డి, స్థానిక నాయకులు పురంధర్‌రెడ్డి, వాసు పాల్గొన్నారు.

శ్మశానాన్ని పరిరక్షించండి

- తహసీల్దార్‌కు ఓజీ కుప్పం వాసుల వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

నగరి: మండలంలో ఓజీ కుప్పం గ్రామ శ్మశాన స్థలం ఆక్రమణకు గురవుతోందని, ఆ స్థలాన్ని పరిరక్షించాలని వైస్ ఎంపీపీ కన్నియప్ప ఆధ్వర్యంలో గ్రామస్తులు తహసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ, తమ గ్రామ శ్మశాన స్థలాన్ని కొందరు రాళ్లు పేర్చి ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. తహసీల్దార్ స్పందిస్తూ, స్థల పరిశీలన చేస్తానన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ సతీష్ కుమార్

పాలసముద్రం: మండల పరిధిలోని గ్రామ సచివాలయ ఉద్యోగులు తప్పకుండా సమయపాలన పాటించాలని ఎంపీడీఓ సతీష్ కుమార్ తెలిపారు. సోమవారం నరసింహపురం, తిరుమలరాజుపురం గ్రామ సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు సాయంత్రం 5 గంటలకు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రస్తుతం ప్రజల నుంచి సమస్యలపై వచ్చిన వినతులు ఎన్ని ? వాటిలో ఎన్ని పరిష్కరించారని సచివాలయ ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. పలు సమస్యలపై వచ్చిన ప్రజల నుంచి అర్జీలు తీసుకుని త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. అనంతరం రికార్డులు తరవుగా పరిశీలించారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, వీఆర్‌ఓ తంగరాజ్, మండల విస్తరణాధికారి సత్యనారాయణ పాల్గొన్నారు.

కల్తీ మద్యంపై నారీ యుద్ధం



పార్టీ శ్రేణులతో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న మాజీమంత్రి ఆర్కేరోజా

- కల్తీ మద్యం స్కామ్‌పై సీబీఐ విచారణ చేయాలి
- సిట్‌తో విచారణ చేస్తే న్యాయం జరగదు
- నాడు గడప గడపకూ సంక్షేమం.. నేడు గడప గడపకూ మద్యం
- మాజీ మంత్రి ఆర్కేరోజా

నగరి: కల్తీ మద్యం స్కామ్‌పై సీబీఐ విచారణ చేసి నిగ్గు తేల్చాలని మాజీ మంత్రి ఆర్కేరోజా డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విచ్చలవిడిగా విక్రయిస్తున్న నకిలీ మద్యాన్ని అరికట్టాలని, బెల్టుషాపులు తొలగించాలని డిమాండ్ చేస్తూ సోమవారం వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి నగరి ఎక్సైజ్ స్టేషన్ వరకు భారీ ఎత్తున నిరసన ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, మహిళల మానప్రాణాలు తీస్తూ, వారి తాళిబొట్లు తెంపేస్తున్న కల్తీ మద్యం స్కామ్‌పై సీబీఐతో దర్యాప్తు చేయాలని, సీఎం జేబు సంస్థ అయిన సిట్‌తో విచారణ చేస్తే న్యాయం జరగదన్నారు. జగనన్న పాలనలో 43వేల బెల్టుషాపులను తొలగించడమే కాక, మద్యం షాపులను తగ్గించి, వాటిని గుడికి, బడికి, ఊరికి దూరంగా ఏర్పాటు చేసి ప్రభుత్వమే నడిపేలా చర్యలు తీసుకున్నారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం దీనికి భిన్నంగా ఊరూరా మద్యం షాపులు దీనికితోడు బెల్టుషాపులను 75 వేలకు పెంచి రేయింబవళ్లూ గడప గడపకూ కల్తీ మద్యాన్ని డోర్ డెలివరీ చేస్తోందని ధ్వజమెత్తారు. ఈ ప్రభుత్వంలో స్కామ్ జరిగి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడితే ఇది వైఎస్సార్‌సీపీ కుట్ర అనడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. ఇదంతా వైఎస్సార్ సీపీ కోవర్టులు చేస్తున్నారని చెప్పే చంద్రబాబు శంకర్‌యాదవ్‌కు సీటు ఇవ్వకుండా జయచంద్రారెడ్డి ఎందుకు సీటు ఇచ్చారని, ఎన్నికలు ముగిసిన 16 నెలల వరకు జయచంద్రారెడ్డి ఎవరి మనిషో మీకు తెలియదా? అని ప్రశ్నించారు. దొరికిపోతే తమ వాడు కాదనడం ఆయనకు నోటితో పెట్టిన విద్య అని, మరి లావు శ్రీకృష్ణ ఎవరు? వేమిరెడ్డి, ప్రశాంత్ రెడ్డి, మాగంటి సుబ్బరామిరెడ్డి, సుభాష్ కొర్, గొలుసు పార్థసారథి, శ్రీనివాసులు..మొదలైన వాళ్లు ఏ పార్టీ నుంచి వచ్చారో '40 ఇయర్స్ ఇండస్ట్రీ'కి తెలియదా? అని వ్యంగ్యంగా అన్నారు. పైగా వీరిలో కొందరికి మంత్రి పదవులు కూడా ఇచ్చారని..వారంతా కోవర్టులేనా? అని సూటిగా నిలదీశారు.

కల్తీమద్యం విక్రయించే షాపులు ధ్వంసం చేసేద్దాం

ఇప్పుడు రాష్ట్రంలో పలుచోట్ల మహిళలు ఆందోళనలు చేయడం చూస్తే ప్రభుత్వం మద్యాన్ని ఎంతగా ఏరులై పారిస్తోందో..వారి కుటుంబాల్లో ఎంత చిచ్చు పెడుతోందని ఇట్టే బోధపడుతోందన్నారు. ఎక్కడ బెల్టుషాపులు, నకిలీ మద్యం విక్రయాలు ఉన్నా, బార్లలోగానీ, షాపుల్లోగానీ కల్తీ మద్యం విక్రయిస్తుంటే ధ్వంసం చేద్దామని పిలుపు నిచ్చారు. ప్రజల పక్షాన ఎంతవరకైనా పోరాటం చేస్తామన్నారు. తప్పుడు కేసులు పెట్టే ఎక్సైజ్ అధికారులు కూడా తర్వాత కాలంలో మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. అనంతరం డిమాండ్లపై ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు రెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నగరి, పుత్తూరు మున్సిపల్ చైర్మన్లు నీలమేఘం, హరి, వైస్‌చైర్మన్లు జయప్రకాష్, శంకర్, నగరి, పుత్తూరు, నిండ్ర, విజయపురం ఎంపీపీలు భార్గవి, మునివేలు, మంజుబాలాజి, దుర్గాదేవి, మున్సిపల్ పార్టీ అధ్యక్షులు రమేష్‌రెడ్డి, ఏకాంబరం, మండల పార్టీ అధ్యక్షులు తిరుమలరెడ్డి, శివరాజు, వేణురాజు, అన్నా లోకనాథం, సుబ్రమణ్యరెడ్డి, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి మేరీ జయరామ్, మహిళా నేతలు దీప, అముద, భారతి, మంజుల, చినపాప, కమల, మాబూషా, గాయత్రి, మునెమ్మ, వైస్ ఎంపీపీలు, నియోజవర్గానికి చెందిన ఎంపీటీసీలు, సర్పంచులు, రాష్ట్ర, జిల్లా, మండల కమిటీ, అనుబంధ కమిటీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మద్యంపై శివాలెత్తిన పవన్ కళ్యాణ్ ఇప్పుడు ఏం చేస్తున్నారు?

ఎన్నికల ముందు మద్యపాన ప్రియుల పొట్ట కొడతారా? అంటూ పవన్‌కళ్యాణ్ ఊగిపోయారని మరి ఇప్పుడు కల్తీ మద్యంతో ప్రాణాలు హరిస్తున్నా వారి కోసం ఎందుకు నోరెత్తడం లేదని ప్రశ్నించారు. ఆయనకు ప్యాకేజీ ఇచ్చేస్తే చంద్రబాబు ఏంచేసినా ఆయన పట్టించుకోరని మండిపడ్డారు.

తప్పు చేయలేదు కనుకే మిథున్ రెడ్డి సీబీఐ విచారణ కోరారు

ఎలాంటి తప్పు చేయలేదు కనుకే ఇప్పుడు జగనన్న ఆశీస్సులతో దమ్మున్న మగాడిలా మిథున్‌రెడ్డి తనపై తానే సీబీఐ విచారణ కోరుతూ కేంద్రానికి లేఖ రాసారన్నారు. తప్పు చేయని వారిని అరెస్ట్ చేసి, లేని లిక్కర్ స్కామ్‌లో ఉన్నట్టు చూపించి, హడావిడి చేశారని కర్మ ఎవరినీ వదిలిపెట్టదని..అది వారికే ఇప్పుడు చుట్టుకుందన్నారు. సీబీఐ దర్యాప్తునకు ఆదేశించే దమ్ము చంద్రబాబుకు, లోకేష్‌కు, పవన్‌కళ్యాణ్‌కు ఉందా? అని ప్రశ్నించారు.

పరామర్శ



పుష్పను పరామర్శిస్తున్న మాజీ మంత్రి రోజా

పుత్తూరు: నగరి వైఎస్సార్‌సీపీ యూత్ ప్రెసిడెంట్ యువరాజ్ తల్లి, మాజీ కౌన్సిలర్ పుష్ప అనారోగ్యంతో పుత్తూరులోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇది తెలుసుకొన్న మాజీ మంత్రి ఆర్కే రోజా సోమవారం ఆసుపత్రికి వెళ్లి ఆమెను పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్య సేవలందించాలని కోరారు.

శ్రీసిటీలో ఆయుర్వేద ఆస్పత్రి నిర్మాణానికి భూమిపూజ



శ్రీ తులసి ఆయుర్వేద ఆస్పత్రికి భూమి పూజ చేస్తున్న ఆస్పత్రి ప్రతినిధులు

శ్రీసిటీ (వరదయ్యపాళెం): శ్రీసిటీలో నూతన ఆయుర్వేద ఆస్పత్రి నిర్మాణానికి సోమవారం ఉదయం భూమి పూజ చేశారు. శ్రీ తులసి ఆయుర్వేద ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.శివ ప్రసాద్ ఆధ్వర్యంలో లాంఛనంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి శ్రీసిటీ డైరెక్టర్ (సీఎస్ఆర్) నిరీషా సన్నారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) సి.రమేష్ కుమార్ హాజరయ్యారు. మొదటి దశలో రూ.75 లక్షల పెట్టుబడితో 10 పడకలు, ప్రత్యేక అవుట్ పేషెంట్ సేవలతో వచ్చే ఉగాది నాటికి ఈ ఆస్పత్రి కార్యకలాపాలు ప్రారంభమవుతాయని డాక్టర్ శివప్రసాద్ తెలిపారు. ఈ ప్రాంత ప్రజల ఆరోగ్య అవసరాలను తీర్చడమే కాకుండా, జాతీయ లక్ష్యమైన 'స్వస్థ భారత్' చొరవను ఇది ముందుకు తీసుకువెళుతుందని పేర్కొన్నారు. ఈ ఆస్పత్రిలో పంచకర్మ, ప్రసూతి తంత్ర (ప్రసూతి - స్త్రీసంబంధిత వ్యాధులు), కాయచికిత్స (సాధారణ వైద్యం) ప్రత్యేక విభాగాలు ఉంటాయన్నారు. భవిష్యత్తులో అవసరాల ఆధారంగా డయాగ్నస్టిక్ ల్యాబ్, పంచకర్మ - క్షారసూత్ర చికిత్స, యోగా, వెల్‌నెస్ సౌకర్యాలు, సంతానోత్పత్తి, రుమటాలజీ, లైఫ్‌స్టైల్ సంబంధిత వ్యాధులు, చర్మ - సౌందర్య చికిత్సల విభాగాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా నిరీషా మాట్లాడుతూ, సాంప్రదాయ ఆయుర్వేద జ్ఞానాన్ని ఆధునిక వైద్య విధానాలతో సమన్వయం చేస్తూ శ్రీ తులసి ఆయుర్వేద ఆస్పత్రి శ్రీసిటీలో సమగ్ర ఆరోగ్య కేంద్రంగా ఎదుగుతుందని వ్యాఖ్యానించారు. శ్రీసిటీ సహజ సిద్ధ అనువైన వాతావరణం దీనికి అత్యంత అనుకూలంగా ఉంటుందని చెప్పారు.

స్పోర్ట్స్ మెటీరియల్, యూనిఫాం వితరణ



మాట్లాడుతున్న శ్యామలదేవి

వెదురుకుప్పం: మండలంలోని దేవళంపేట హైస్కూల్ విద్యార్థులకు స్పందన ఫౌండేషన్, జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్పోర్ట్స్ పరికరాలు, యూనిఫాం వితరణ చేశారు. సోమవారం పాఠశాలలో జరిగిన సమావేశంలో సుమారు రూ.20 వేలు విలువ చేసే పరికరాలతో పాటు ఒక్కొక్కరికి రెండేసి జతలను అందజేసినట్లు స్పందన ఫౌండేషన్ కోఆర్డినేటర్ శ్యామల దేవి మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయాలన్న సంకల్పంతో తమవంతు సహాయ సహకారాలు అందిస్తున్నట్లు చెప్పారు. గడిచిన 20 ఏళ్లుగా సుమారు 250 పాఠశాలలకు పైగా విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌తో పాటు వారికి అవసరమైన అభ్యసన సామగ్రి, స్పోర్ట్స్ పరికరాలు, దుస్తులు వంటి సహకారాలను ఉచితంగా అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. కళాశాలలకు ఆర్వో ప్లాంట్లు నెలకొల్పడంతో పాటు మరమ్మతులకు సంబంధించి తనవంతు సాయం చేస్తున్నామన్నారు. ప్రభుత్వాలు అందించే ప్రోత్సాహకాలతో పాటు తమ స్పందన ఫౌండేషన్ ద్వారా ఏదో కొంత అందించే సాయంతో విద్యార్థులు ముందుకు సాగాలన్నారు.

ఔషధ మొక్కల పెంపకంతో ఉపాధి

తిరుపతి సిటీ: ఔషధ మొక్కల పెంపకంతో మెరుగైన ఉపాధి అవకాశాలను పొందవచ్చని ఔషధ మొక్కలు, సుగంధ ద్రవ్యాల బోర్డు ముఖ్య కార్యనిర్వహణాధికారి అవుల చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం ఎస్వీ ఆర్ట్స్ కాలేజీలో ఔషధ మొక్కలు- ఉపాధి అవకాశాలు అనే అంశంపై నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. కాలేజీ ఆవరణలో హెర్బల్ నర్సరీ ఏర్పాటుకు రూ.6.25 లక్షలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వేణుగోపాల్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై. మల్లికార్జున రావు, బోటనీ విభాగాధిపతి ఏ.సురేఖ, పూర్వ అధిపతి డాక్టర్ ఎం.నాగరాజు, ఫ్యాకల్టీలు డాక్టర్ ఎం. సుధాకర్, డాక్టర్ కె. సుజాత, ఆయుర్వేద కళాశాల సహాయ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మత్తులో జోగుతున్న పల్లెలు



మీడియాతో మాట్లాడుతున్న సమన్వయకర్త కృపాలక్ష్మి



ఎక్సైజ్ సీఐకి వినతిపత్రం ఇస్తున్న కృపాలక్ష్మి

కార్వేటినగరం: పచ్చని పల్లెల్లో విచ్చలవిడిగా బెల్టు షాపులు ఏర్పాటు చేసి మద్యం విక్రయాలు చేస్తుండడంతో పేద కుటుంబాలు గుల్లవుతున్నాయని జీడీనెల్లూరు నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త కళత్తూరు కృపాలక్ష్మి ఆరోపించారు. వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం నాయకులు, కార్యకర్తలతో కలసి కార్వేటినగరంలో ఎక్సైజ్ కార్యాలయం వద్ద నకిలీ మద్యం అమ్మకాలపై నిరసన తెలిపారు. అనంతరం ఎక్సైజ్ సీఐకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పచ్చని పల్లెల్లో పాలు కన్నా నకిలీ మద్యమే ఎక్కువగా లభ్యమవుతోందన్నారు. ఏరులై పారుతున్న మద్యంతో పేద కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, అదే కాకుండా కుటుంబ పెద్ద దిక్కును కోల్పోతున్నారని విమర్శించారు. మద్యానికి అలవాటు పడి కొందరు తమ భార్యల మెడలో తాళిబొట్టును కూడా తాకట్టు పెడుతుండడం ఆవేదన కలిగించే విషయమన్నారు. ఇందుకు కారణం కూటమి ప్రభుత్వం విచ్చలవిడిగా మద్యం విక్రయాలకు అనుమతి ఇవ్వడం వల్లేనని దుయ్యబట్టారు. ఈ ప్రభుత్వం వచ్చాక మహిళలకు గౌరవం లేదని, తాగిన మత్తులో ఆడపిల్లలపై అత్యాచారాలకు పాల్పడుతున్నా సీఎం చంద్రబాబు పట్టించుకోకపోవడం దారుణమన్నారు.

ఎన్నికలప్పుడు అలా.. ఇప్పుడు ఇలా..

ఎన్నికల సమయంలో నాడు చంద్రబాబు కూటమి అధికారంలోకి వస్తే నాణ్యమైన మద్యం అందిస్తానని చెప్పి.. ఇప్పుడు నకిలీ మద్యం తయారీదారులను ప్రోత్సహిస్తూ మోసం చేస్తున్నారని కృపాలక్ష్మి ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మంచి విద్య, వైద్యం ఇవ్వకుండా, కల్తీ మద్యం అందించి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతోందని ఆరోపించారు. దీనికితోడు వైద్య విద్యను సైతం ప్రైవేటు పరం చేయడంతో పేద విద్యార్థులు డాక్టర్ చదవాలన్న ఆశలు అడియాసలు అయ్యాయని దుయ్యబట్టారు. అక్రమ మద్యం కేసులో పట్టుబడిన వారిని కఠినంగా శిక్షించాలని, అంతేగానీ సస్పెండ్ చేశామని, చర్యలు తీసుకుంటామని చెప్పడం సరికాదని ఆమె ప్రభుత్వానికి హితవు పలికారు. అనంతరం ర్యాలీగా వెళ్లి నకిలీ మద్యం నియంత్రించాలని ఎక్సైజ్ సీఐకి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు రాధికారెడ్డి, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి చందురాజు, మండల కన్వీనర్ మణి(శ్రీరంగరాజపురం), సర్పంచ్ ధనంజయవర్మ, నాయకులు పట్నం ప్రభాకర్‌రెడ్డి, వెంకటేష్, కుప్పయ్య, శేషాద్రి, మునికృష్ణ, నందగోపాల్,మురళీ, మోహనకుమారి, సుమతి, జనార్ధన్, ధనశేఖర్‌యాదవ్, వెంకటరత్నం, మురళి, శివప్రకాష్ మొదలి, మురగయ్య, లోకనాథ నాయుడు, శోభన్‌బాబు, అమీద్, పలువురు మహిళలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విజ్ఞానాన్ని పెంచేందుకే చెకుముకి పోటీలు



జనవిజ్ఞాన వేదిక వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరుస్తున్న ఎంఈఓ విజయకుమార్

కార్వేటినగరం: విద్యార్థుల్లో సైన్స్‌పై మక్కువ పెంపొందించేందుకు జనవిజ్ఞాన వేదిక చెకుముకి పోటీలు నిర్వహిస్తోందని ఎంఈఓ విజయకుమార్ అన్నారు. సోమవారం చెకుముకి సైన్స్ సంబరాలకు సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ 35 ఏళ్లుగా జనవిజ్ఞాన వేదిక విద్యార్థులకు సైన్స్ పట్ల మక్కువ పెంచేందుకు చెకుముకి పోటీలు నిర్వహిస్తున్నాయని అన్నారు. ఈ పోటీలు మండల స్థాయిలో ఈ నెల 18వ తేదీన నిర్వహిస్తామని, అలాగే జిల్లాస్థాయిలో 23వ తేదీ, రాష్ట్రస్థాయిలో డిసెంబరు 12, 13, 14 తేదీల్లో నిర్వహిస్తామన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈఓ 2 మనోజ్‌కుమార్, జనవిజ్ఞాన వేదిన కన్వీనర్ వేణుగోపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గోపూజ



నగరి: మున్సిపల్ పరిధిలోని ఏకాబరకుప్పం నందనార్ స్వామి ఆలయంలో పంచ భూత మహాయాగంలో భాగంగా సోమవారం గోపూజ నిర్వహించారు. 48 రోజుల పాటు ఈ యాగ పూజలు చేస్తామని నిర్వాహకులు తిరువియార్ రమేష్ స్వామి తెలిపారు. ప్రజా క్షేమం, ప్రపంచ శాంతి కోసం ఈ యాగపూజలు చేస్తున్నట్టు చెప్పారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

ఆలయం వద్ద నిర్వహిస్తున్న గోపూజ

భాస్కర్‌రాజు స్మృతి భవనంగా పేరు మార్పు





మాట్లాడుతున్న సంఘ అధ్యక్షుడు గుణశేఖర్‌రెడ్డి, హరికథ గానం చేస్తున్న ఒంటి రవి

పుత్తూరు: ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల భవనాన్ని భాస్కర్‌రాజు స్మృతి భవనంగా మార్పు చేస్తున్నట్లు పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు జి.గుణశేఖర్‌రెడ్డి ప్రకటించారు. సోమవారం సంఘ సర్వసభ్య సమావేశం గుణశేఖర్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ వ్యవస్థాపక అధ్యక్షుడు బి.భాస్కర్‌రాజు అవిరళ కృషి ఫలితంగా పెన్షనర్స్ భవనం ఏర్పాటైందని గుర్తు చేశారు. ఆయన అకాల మృతి సంఘానికి తీరని లోటన్నారు. అందుకే భవనానికి భాస్కర్‌రాజు స్మృతి భవనంగా పేరు మార్పును సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించడం సంతోషదాయకమన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలుగు పండితుడు, ప్రముఖ భాగవతార్ ఒంటి రవి భక్త కుచేల హరికథాగానం అందరినీ అలరించింది. అనంతరం నారాయణాద్రి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విశ్రాంత ఉద్యోగులు హేమలత, వెంకట్రామయ్య భోజన సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో హరికథ వాయిద్య బృందం మురళి, దేవశర్మ, సంఘ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

గౌరవం లేదు.. వేతనమూ లేదు!



సర్వసభ్య సమావేశంలో నేలపై కూర్చున్న ఎంపీపీ, జడ్పీటీసీ, సభ్యులు



ఎంపీపీతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

- చేసిన పనులకు బిల్లులు ఇవ్వరా?
- మండల సమావేశంలో నేలపై కూర్చుని జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచుల నిరసన

నగరి: ప్రస్తుత ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులకు అడుగడుగునా అవమానాలే ఎదురవుతున్నాయని జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచులు, కో–ఆప్షన్ సభ్యులు ధ్వజమెత్తారు. ఏడాదిన్నర క్రితం ప్రజాప్రతినిధులు చేసిన పనులకు ఇప్పటివరకూ బిల్లులు చెల్లించకుండా రాజకీయ కక్ష సాధింపు చేస్తుంటే తాము ఎందుకు కుర్చీల్లో కూర్చోవాలంటూ నేలపై కూర్చుని వినూత్న నిరసన వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో మండల సర్వ సభ్య సమావేశం దీనికి వేదిక అయ్యింది. ఎంపీడీఓ వాణి తాను కొత్తగా చార్జి తీసుకున్నానంటూ సభ్యులకు నచ్చచెప్పే ప్రయత్నం చేయగా అధికారుల వ్యవహారశైలిపై సభ్యులు నిప్పులు చెరిగారు. ఎంపీపీ భార్గవి, జెడ్పీటీసీ సభ్యులు గాంధీ మాట్లాడారు. ఏడాది క్రితం గ్రామాల్లో ప్రజాప్రతినిధులుగా అభివృద్ధి పనులు చేసిన వారికి ఇప్పటివరకు బిల్లులు మంజూరు చేయలేదని, అధికారులకు పలుమార్లు నివేదించినా ఏమాత్రం చలనం లేదని మండిపడ్డారు. తాము చేసిన పనులను ఎంపీడీఓలు, డీఈలు, ఏఈలు మరు పరిశీలన కూడా చేశారని, అయినా బిల్లులు పెట్టకపోవడంలో ఔచిత్యం ఏమిటని ప్రశ్నించారు. గత సమావేశంలో ఇదే సమస్యపై నిరసన వ్యక్తం చేస్తే, సీఈవో బిల్లుల చెల్లింపులకు హామీ ఇచ్చారని, అయితే 46 లక్షలకు రూ.10 లక్షలకు మాత్రమే బిల్లులు పెట్టారని మిగతా అంతా పెండింగ్‌లో ఉందని నిరసిన వ్యక్తం చేశారు. సీఎఫ్ఎంఎస్ నిధులు రూ.30 లక్షలు వినియోగించకపోవడంతో మురిగిపోయాయని మండిపడ్డారు. మరోవైపు గ్రామాల్లో సమస్యలపై అధికారులు ఏమాత్రం దృష్టి సారించడం లేదని, పారిశుద్ధ్యం, నీటి సమస్య తీవ్రంగా ఉందని ధ్వజమెత్తారు. తాము నేలపై కూర్చుని నిరసన వ్యక్తం చేస్తుంటే, అధికారులు కుర్చీలపై కూర్చుని నవ్వుకుంటూ ఉండటం శోచనీయమన్నారు. ఏడాదిన్నర కాలం పైగా గౌరవంతోపాటు గౌరవ వేతనం కూడా ఆగిపోయిందన్నారు. దీనిపై ఎంపీడీఓ ఫోన్‌లో సీఈఓను సంప్రదించారు. ఆపై సీఈఓ ఎంపీపీ, జెడ్పీటీసీలతో ఫోన్‌లో మాట్లాడుతూ.. వారంలోపు బిల్లులు చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో సభ్యుల నిరసన, ఆందోళనకు తెరపడింది. ఆ తర్వాత సభ్యులు కుర్చీలపై కూర్చోవడంతో సమావేశం ప్రారంభమైంది. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కన్నియప్ప, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి



ప్రకృతి వ్యవసాయంలో సాగు చేసిన కూరగాయలను విక్రయిస్తున్న సిబ్బంది

పాలసముద్రం: ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని నగరి డివిజన్ ప్రాజెక్టు రిసోర్స్ పర్సన్ పుష్ప తెలిపారు. సోమవారం కృష్ణజమ్మపురం యూనిట్‌లోని గ్రామ సంఘ అధ్యక్షురాలు కోశాధికారి మునియమ్మ, నిర్మల ఆధ్వర్యంలో శ్రీకావేరిరాజుపురం గ్రామ సచివాలయ ఆవరణలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించి, ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో చెరుకు సాగు చేస్తే, తద్వారా వచ్చే బెల్లంను తిరుపతి తిరుమల దేవస్థానం తీసుకోవడానికి సిద్ధంగా ఉందన్నారు. పంట సాగులో విత్తనం నుంచి పంట కోత వరకు ద్రవ, ఘన జీవామృతం, కషాయాలతో పండించడంపై అవగాహన కల్పించారు. అనంతరం ఘనజీవామృతం తయారీపై రైతులకు అవగాహన అవగాహన కల్పించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయంలో పండించిన కూరగాయలను విక్రయించారు. కార్యక్రమంలో సర్పంచ్ మహేష్ బాబు, డ్వాక్రా సంఘాల సభ్యులు, రైతులు పాల్గొన్నారు.